క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్‌లో ఉన్న మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదానం చేశారు. మావచరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఆర్యవైశ్య నాయకుడు రామారావు జన్మదినం నిర్వహించారు. రూ. 50 వేల విరాళాన్ని నిర్వాహకుడు షేక్ జమాల్‌కి అందజేయనున్నట్లు రామరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకులు ఎండీ లతీఫ్, మాజీ వైస్ ప్రెసిడెంట్ చెవుల దుర్గ లక్ష్మీ కాంతం, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మహ్మద్ జానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈ జె.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని భవనాశి యల్లారావు కల్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సరక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఎల్ఐసీ క్రిష్టారావు బజారులోని 26వ వార్డులో కార్యక్రమం ఉదయం 9 గంటల నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

బార్లు, మద్యం దుకాణాల్లో తనిఖీలు



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల నిర్వహణపై కడపకు చెందిన ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలను, వ్యత్యాసాలను పరిశీలించారు. ఎక్కడా వ్యత్యాసాలు కనబడలేదని గుర్తించారు. అధికారులు ప్రతి మద్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులు నమోదు చేసుకున్నారు. అనంతరం బార్ అండ్ రెస్టారెంట్లకు చేరుకొని మద్యం అమ్మకాల పై తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో ఆరుగురు ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఉన్నారు.

చామర్రులో అష్టద్రవ్య మహాగణపతి హోమం



అచ్చంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా ప్రజల కష్టాలుతీరి సుఖశాంతులతో సుభీక్షంగా ఉండాలన్న కాంక్షతో మండలంలోని చామర్రు కృష్ణానది తీరంలో స్వయంభుగా వెలసిన శ్రీ వరసిద్ధివినాయకుని దేవాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు మంగళవారం రాత్రి అష్టద్రవ్య మహాగణపతి హోమం జరిపించారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణ మధ్య నిర్వహించిన హోమం రెండు గంటలపాటు ఏకధాటిగా కొనసాగింది. చామర్రు రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్విఘ్నంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులతోపాటు వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై దాడులు అప్రజాస్వామ్యం

సత్తెనపల్లి: దేశంలో ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో అరాచక పాలన సాగుతుందని దీనిని ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ అన్నారు. మంగళవారం బ్లాక్ డే సందర్భంగా పట్టణంలోని అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సభ కార్యక్రమం జరిగింది. ఈ సభా కార్యక్రమానికి డీవైఎఫ్ఐ నాయకులు పెండ్యాల మహేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డి.విమల, జి.రజిని, జి.మల్లేశ్వరి, అవ్వారు ప్రసాదరావు, ఎ.వీర బ్రహ్మం, జి.బాలకృష్ణ , కె.శివదుర్గారావు, పి.సూర్య ప్రకాశరావు, షేక్ సాయిబా, షేక్ సైదులు, ఎం.వెంకటనారాయణ, జడ రాజ్ కుమార్, పి.ప్రభాకర్, జి.సుసులోన్, ఎ.ప్రసాదరావు , ఆర్ పురుషోత్తం, ఎం.హరి పోతురాజు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



కొత్తపల్లిలో బీపీ చెక్ చేయించుకుంటున్న జేసీ శ్యామ్ ప్రసాద్



పట్లవీడులో డాక్టర్‌తో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

- జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన

దుర్గి: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం కంచరగుంట గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య పరీక్షలు, మందుల పంపిణీ వివరాలను స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవటం జరుగుతోందన్నారు. ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యులతో పరీక్షలు నిర్వహించి అవసరమైతే ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఉన్న ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నట్లు చెప్పారు. హెల్త్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏసూరి సాయిశంకర్, జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద, తహసీల్దార్ ఎం.రమేష్‌కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి తదితరులు పాల్గొన్నారు.

దుర్గి: కంచరగుంట గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నెహ్రూనగర్, మంగాపురం తండాల నుంచి ప్రజలు వైద్య పరీక్షలకు హాజరయ్యారు. పలు విభాగాలకు చెందిన ప్రభుత్వ వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, తహసీల్దారు ఎం.రమేష్‌కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి, ఎంపీటీసీ పసుపులేటి వెంకట్రామయ్య, బొంతా కృష్ణ, నెహ్రూనగ్ తండా సర్పంచ్ సుబ్రహ్మణ్యం నాయక్, ధర్మవరం సర్పంచ్ వెంకటరెడ్డి, ముటుకూరు సర్పంచ్ గొంది నాసరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చినకొదమగుండ్లలో వైద్య శిబిరం

కారెంపూడి: జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం చినకొదమగుండ్ల గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానిక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద జరిగిన



చినకొదమగుండ్లలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుబ్బారెడ్డి

శిబిరంలో.. 300 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ చిన్నపరెడ్డి, డాక్టర్ విజయానాయక్, డాక్టర్ దుర్గారావు వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించారు. ముందుగా వచ్చిన వారికి వైద్య సిబ్బంది బీపీ, షుగర్ పరీక్షలు చేసి, జగనన్న సురక్ష కార్డులు అందించారు. గాదెవారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్ ఆంజనేయులు నాయక్ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. గ్రామ సర్పంచ్ జెడ్డా కోటిరెడ్డి, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లుట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

మాచవరం: మండలంలోని పిల్లుట్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దారం అంబులమ్మ, ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్డీ వెంకటరావు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణే లక్ష్యం..

వెల్దుర్తి: మండలంలోని పట్లవీడు సచివాలయం పరిధిలోని పట్లవీడు, యర్రబాలెం, శివలింగాపురం గ్రామ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ కల్ప శ్రీ, వైస్ ఎంపీపీ రాయంకుల గోపాల్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, సర్పంచ్ చల్లా శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.ప్రసాద్, తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొజ్జా అంజిబాబు, వైద్యులు ఆశీర్వాదం, ఉప్పలపాడు, పీహెచ్‌సీ వైద్యులు శ్రీరామ్, ముఖర్జీబాయి, శిరిగిరిపాడు ప్రాథమిక వైద్యులు నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట..

పిడుగురాళ్లరూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశయ్య పాల్గొన్నారు. 620 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. సమస్యలు ఉన్న వారిని గుర్తించి వివిధ హాస్పిటల్స్‌కు రిఫర్ చేశారు. సర్పంచ్ షేక్ ఖాశింబీ బడే సాహెబ్, మాబు, ఎంపీటీసీలు శ్రీనివాసరావు, నాగిరెడ్డి డాక్టర్లు కె. ప్రవీణ్‌రెడ్డి, ప్రభావతి, నజియా, బ్రహ్మయ్య, సీహెచ్‌వో ప్రకాష్, సూపర్‌వైజర్లు ప్రభాకర్, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకున్న జేసీ

మాచర్ల రూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ శ్యామ్ ప్రసాద్ శిబిరాన్ని సందర్శించి, రోగులతో ఆయన మాట్లాడారు. కంటి, బీపీ పరీక్షలను చేయించుకున్నారు. సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ప్రత్యేకాధికారి గబ్రూనాయక్, ఎంపీడీఓ సరోజని దేవి, తహసీల్దారు షేక్ మహమ్మద్ హుస్సేన్, వైద్యులు వెస్లి, శివలీల, ప్రవీణ్, రవి, శ్రీనివాసరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

పేదలందరికీ వైద్యం

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ దాసరి చాడేశ్వరి అధికారులతో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ మోర్తల ఉమ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా రీ–సర్వే పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



కారెంపూడిలో రేషన్ పంపిణీ చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

దుర్గి: భూములను సక్రమంగా రీ–సర్వే చేసి, సంబంధిత హక్కు పత్రాలను రైతులకు త్వరితగతిన అందించే విధంగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన సర్వే సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేసి, వారి నుంచి తమ శాఖకు కావాల్సిన పత్రాలను పొందాలని సూచించారు. రీ–సర్వే సమయంలో భూ యజమానులు అందుబాటులో లేకపోతే.. వారి బంధువులను ఫీల్డ్ మీదకు వచ్చే విధంగా చూడాలని చెప్పారు. నిర్దేశించిన గడువులోగా సర్వేను పూర్తి చేసి, జగనన్న భూ శాశ్వత హక్కు పత్రాలు అందజేసి, సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.రమేష్‌కుమార్, మండల సర్వేయర్ రఘుపతి, పలువురు వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రీ–సర్వేకు సహకరించాలి

మిట్టగుడిపాడు(రెంటచింతల): సమగ్ర భూరీ సర్వేకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో చేపట్టిన రీ–సర్వేను ఆయన పరిశీలించారు. గ్రామంలో మొత్తం 3,124 ఎకరాల భూమి ఉందని, ఇప్పటి వరకు 2,108 ఎకరాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందని తహసీల్దారు కె.పుల్లారావు జేసీకి వివరించారు. సర్వేలో డ్రోన్స్, ఓఆర్ఐ పరికరాలు, రోవర్లు, సర్వే రాళ్ల సమకూర్చుకుని నాలుగు కీలక పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మండల సర్వేయర్ తోట సుధాకర్, గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ ఆకస్మిక తనిఖీ..

కారెంపూడి: స్థానిక ఇందిరా నగర్ కాలనీ సెంటర్‌లో రేషన్ పంపిణీని జేసీ శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మాచర్ల వెళ్తూ మార్గమధ్యలో కారెంపూడిలో ఆగి యూడీసీ వాహనం ద్వారా రేషన్ సరుకుల పంపిణీని తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలో ఎన్ని రేషన్ కార్డులున్నాయి.. ఇప్పటి వరకు ఎంత మందికి సరుకులు పంపిణీ చేశారని జేసీ ఆరా తీశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న డీఎస్ఓ పద్మశ్రీ కూడా రేషన్ పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. జేసీ స్వయంగా కార్డుదారులకు కందిపప్పు, గోధుమ పిండి, పంచదార పంపిణీ చేశారు. వాహన శ్రేణి అధికారులు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని జేసీ ఆదేశించారు. తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ పర్యవేక్షణలో జరుగుతున్న ఫోర్టిఫైడ్ బియ్యం లబ్ధిదారులకు అందిస్తున్న తీరును జేసీ తనిఖీ చేశారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

రెంటచింతల: పాఠశాల అభివృద్ధికి కృషి సహకరించాలని జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. రెంటాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి కేటాయించిన సర్వే నంబరు 403లోని 2.83 ఎకరాల భూ వివాదం హై కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం జేసీ శ్యామ్ ప్రసాద్ వివాదాస్పద భూమిని, గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోవడం లేదని ఉపాధ్యాయులు ఆయన వివరించారు. మాజీ జెడ్పీటీసీ నవులూరి భాస్కర్‌రెడ్డితో జేసీ మాట్లాడుతూ స్కూల్ నిర్మాణానికి కేటాయించిన భూమి ఎంతో అనుకూలమని, ఈ స్థలం పై కోర్టుకు వెళ్లిన వారితో మాట్లాడాలని సూచించారు. జేసీ వెంట తహసీల్దారు కట్టికోట పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక చట్టాలను తుంగలో తొక్కిన బీజేపీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

పిడుగురాళ్ల: కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మిక చట్టాలను తుంగలో తొక్కటం సరికాదని సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ఐలాండ్ సెంటర్ నుంచి బ్యాంక్ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిందని, అందులో భాగంగానే 44 కార్మిక చట్టలను రద్దు చేసి నాలుగు వేతన కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ సిఫార్సులు వెంటనే అమలు చేయాలని, రైతును ఆదుకోవాలని కోరారు. ఉత్తరప్రదేశ్‌లోని లంకేపూర్ గ్రామంలో శాంతియుతంగా పోరాటం చేస్తున్న రైతులను బీజేపీ కేంద్ర మంత్రి కుమారుడు అజయ్ మిశ్రా కారుతో తొక్కించారని, ఈ ఘటనలో ముగ్గురు రైతులు, ఒక మీడియా మిత్రుడు చనిపోయాడని చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని ఇప్పటికి వరకు అరెస్టు చేయకోవడం సిగ్గుచేటన్నారు. రైతు సంఘం నాయకులు బుంగ నాగేశ్వరరావు, రామయ్య, భూ లక్ష్మీ, వెంకట కృష్ణ, కొండారెడ్డి చెన్నయ్య, అనిల్, వెంకటేశ్వర్లు, సైదా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సైదయ్య సేవలు ఎనలేనివి



సైదయ్య కుటుంబ సభ్యులకు సత్కారం

మాచర్ల పల్నాడులో స్వాతంత్రయోద్యమంలో త్యాగాలు చేసిన మాజీ ఎంపీ కోటా సైదయ్య సేవలు మరువలేనివని కేసీపీ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ అన్నారు. మంగళవారం పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కోట సైదయ్య కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఉన్నం నరసింహారావు, డాక్టర్ స్థిమిత, శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు.. విద్యార్థులకు గేయాలు, నృత్యాలు, వృక్షత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొండవీటి రామకోటయ్య, ప్రెసిడెంట్ చిన్ని సత్యనారాయణ, కార్యదర్శి పఠాన్ నాగూర్ వలి, అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, కె.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌కు యడ్లపాడు విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం విజయభారతి, పీఈటీ షేక్ ఆషీతున్

యడ్లపాడు: త్వరలో జిల్లాస్థాయిలో జరిగే వివిధ క్రీడా పోటీలకు యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 8 మంది ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జి విజయభారతి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఈనెల 29వ తేదీన నాదెండ్ల మండలం సాతులూరు జెడ్పీహైస్కూల్లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ, ఖో–ఖో, త్రోబాల్, వాలీబాల్ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. ఆయా పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులు అండర్ -14 కబడ్డీ బాలికల విభాగంలో పఠాన్ నాస్మిన్, బాలుర విభాగంలో జి ధర్మతేజ, అండర్ -17లో కబడ్డీలో ఆర్ కిషోర్, అండర్ -14 త్రోబాల్ బాలికల్లో ఎం సమీర, అండర్–17 త్రోబాల్ పి రూపాంజలి, అండర్ -17 వాలీబాల్‌లో యు అభిలాష్, అండర్ -14 ఖో–ఖోలో జి తులసీరాం, అండర్ -17 వాలీబాల్ జి సాగర్‌బాబు జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో పాటు వారికి మంచి తర్ఫీదునిచ్చిన పాఠశాల పీఈటీ షేక్ ఆషీతున్‌ను సత్కరించారు. జిల్లాస్థాయిలోనూ క్రీడా సత్తాను చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో పంచాయతీ ఎంపీపీ పి ఝాన్సీ, సర్పంచ్ కె హేమ, ఎంఈవో 1,2 నాగరత్నం, అరుణకుమారి, పీఎం చైర్మన్ కె వేణుబాబు ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువుల మేత కోసం వెళ్లి విద్యుదాఘాతంతో మృతి

బెల్లంకొండ: పొలంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ కొట్టి వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానిక ఎస్ఐ కె.అమీర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మండల కేంద్రమైన బెల్లంకొండకు చెందిన తాటికొండ శ్రీను (26) అని పేర్కొన్నారు. రోజు మాదిరిగా సోమవారం సాయంత్రం శ్రీను పశువుల మేత కోసం పొలానికి వెళ్లాడు. కాగా విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న పొలాలలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక రైతు మరో పొలంలో ఉన్న బోరుకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకున్నాడు. కాగా గడ్డి కోయడానికి వెళ్లిన శ్రీను ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గడ్డి కోయడానికి వెళ్లిన శ్రీను రాత్రి 10 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలాలకు వెళ్లి వెతకడంతో విగతజీవిగా పడి ఉన్నాడు. మృతి చెందిన శ్రీనును చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి వచ్చి వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయం

గుంటూరు ఎడ్యుకేషన్: వృత్తి బాధ్యతలు అంకితభావంతో పని చేసిన శ్యామల సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. పేరేచర్ల జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన శ్యామల సుబ్బారెడ్డి సంస్మరణ సభను మంగళవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ విద్యారంగాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించడంతో పాటు ఎస్టీయూ నిర్మాణానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనూ సుబ్బారెడ్డి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు కె.శ్రీనివాసరావు, ఎంపీ సుబ్బారావు పాల్గొన్నారు.

రాయితీలు పొందాలంటే పంట నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి



పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

అచ్చంపేట: రైతులంతా తమ పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలని, అలా చేయించుకున్న వారికే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని కోనూరు రైతుభరోసా కేంద్రంలో మంగళవారం ఆయన వ్యవసాయ సిబ్బంది చేసే పంట నమోదులు, ఈకేవైసీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట మండలంలో 21 వేల ఎకరాలలో పంట సాగు చేస్తున్నారన్నారు. ఈరోజు వరకు కేవలం 15 వేల ఎకరాలను మాత్రమే పంట నమెదు చేయడం జరిగిందన్నారు. ఈకేవైసీ 3 వేల ఎకరాలు మాత్రమే చేసినట్లు చెప్పారు. పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ కూడా చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తిస్తాయని చెప్పారు. మరో రెండు మూడు రోజులలో గడువు ముగియనుందని రైతులంతా త్వరపడాలని ఆయన కోరారు. అనంతరం ఆయన రైతుభరోసా కేంద్రం ద్వారా ఇచ్చే ఎరువులను పరిశీలించారు. ఆయన వెంట ఏవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు



సత్తెనపల్లి: సీనియర్ సిటిజన్స్ (వృద్ధులకు) పరిరక్షణకు వారి మనుగడ కోసం చట్టంలో ప్రత్యేక సెక్షన్లు ఏర్పాటు చేశారని న్యాయవ్యవస్థ పూర్తి భరోసా కల్పిస్తోందని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మాతృ శ్రీ మొల్లమాంబ అనాథ వృద్ధుల ఆశ్రమంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వృద్ధుల మనుగడ కోసం ఉన్న అనేక చట్టాలను వివరించారు.అనంతరం అక్కడ ఉన్న ఒకొక్క వృద్ధుని గురించి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వారికి అవసరమైన సలహాలను, సూచనలను అందించారు. మండల న్యాయ సేవాధి కార సంస్థ తరుపున ఉచిత న్యాయ సేవలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ కె.విజయ గోపాల్, తదితరులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి




స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సంఘాల నేతలు

నకరికల్లు: లఖింపూర్ ఘటనలో రైతులను కారుతో తొక్కించి దారుణ ఘాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని రైతు కార్మికసంఘం నాయకులు అనుముల లక్ష్మీశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. లఖింపూర్ ఘటన జరిగి ఏడాది పూర్తి కావడంతో రైతుసంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బ్లాక్ డే పాటిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన రైతు నల్లచట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న రైతులను గతేడాది బీజేపీ ఎంపీ కుమారుడు తన కారుతో తొక్కించి హత్యకు ఒడిగట్టాడన్నారు.

సాక్ష్యాలు ఉన్నా నిందితులను శిక్షించకపోవడం దారుణమన్నారు. తక్షణమే నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్.మస్తాన్ వలి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, ఎంసీపీఐయూ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె కుమారి, మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, జి.పిచ్చారావు, గోదా చిన్ని, లాలూ, గుంజా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా ఫినేహాస్



అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం నజరైతు ప్రార్థనా మందిరంలో మంగళవారం మండల ఎనాయింటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ఎనాయింటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈసందర్భంగా సంస్థ నూతన అధ్యక్షుడు ఫినేహాస్ మాట్లాడుతూ తొమ్మిది మందితో కూడిన నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడు గా వందనం, అధ్యక్షుడిగా నండూరి ఫినేహాస్, ఉపాధ్యక్షుడు గా పచ్చల హానోక్, కార్యదర్శిగా నండూరు కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి బొక్కా కిరణ్, కోశాధికారి గా మేకల శరత్ బాబు, కమిటీ సభ్యులుగా యోహాను, ఏలియా, దేవిడ్, గిద్యోనులను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. ఈ ఫెలోషిప్ ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియచేశారు.